పగడాల నాగేందర్

కథ

# దెయ్యం

## అమావాస్య చీకటి!

కళ్ళు పొడుచుకున్నా కానరాని కటిక చీకటి.

ఎక్కడో దూరాన నక్కల ఊళలు, ఎండుటాకులపై ఏదో పాకుతున్న శబ్దం.


వీస్తున్న గాలికి చెట్లన్నీ తలారబోసుకున్న భూతాల్లా ఊగుతున్నాయి. ఇంతలో సన్నటి వానజల్లు మొదలయ్యింది.

మధ్య మధ్యన కళ్ళు అదిరిపడే మెరుపులు, ఉరుములు. ఉత్తరాన మెరిసిన మెరుపుకు, రోడ్డుపక్కన స్మశానంలో తెల్లటి సమాధిపై ఎవరో స్త్రీ కూర్చొని రోదిస్తున్న దృశ్యం స్పష్టంగా కనబడుతోంది సురేష్‌కి. "ఇది నిజమా? లేదా తను భ్రమపడుతున్నాడా?" మనసులో అనుకొని, హోండా స్పీడ్ పెంచాడు. "అనవసరంగా ఇంత రాత్రి బయల్దేరాను" తనలో తాను గొణుక్కున్నాడు. వాచీ చూసుకున్నాడు. దాదాపు రాత్రి పన్నెండు గంటలు కావొస్తుంది. "అప్పుడే ఇంత రాత్రయ్యిందేంటి?" అనుకున్నాడు. క్రమంగా అతని మనసులో భయం చోటుచేసుకుంది.

** ** **

సురేష్ తండ్రి హైస్కూల్ హెడ్మాస్టర్. దాదాపు అయిదేళ్ళ నుంచి దుప్పల్లి అనే ఓ కుగ్రామంలో హెడ్మాస్టర్‌గా పని చేస్తున్నాడు. పిల్లల చదువులు ఆ ఊళ్ళో సరిగా సాగట్లేదని; భార్యను, పిల్లలను నల్లగొండలో ఉంచాడు. తండ్రి పనిచేస్తూ ఉండటం వల్ల, దుప్పల్లితో సురేష్‌కి గాఢమైన సంబంధం ఏర్పడింది. దుప్పల్లి దట్టమైన అడవుల మధ్య ఉండే మారుమూల గ్రామం. దుప్పల్లి వెళ్ళాలంటే, నల్లగొండ నుంచి వలిగొండ వెళ్ళి, అక్కడ్నించి తొర్రూర్ వెళ్ళే రోడ్డులో నర్సాపూర్ అడ్డరోడ్డు దగ్గర దిగాలి. అక్కడ్నించి మట్టి రోడ్డు మొదలవుతుంది. దట్టమైన అడవులతో, మోడుగుచెట్లతో పగలే భయానకంగా ఉంటుంది ఆ రోడ్డు. దుప్పల్లిలో హైస్కూల్ ఉన్నప్పటికి సరిమైన రోడ్ సౌకర్యంలేదు. నర్సాపూర్ నుంచి నాలుగు కిలోమీటర్లు మట్టి దారిలోనే వెళ్ళాలి.

సురేష్ వాళ్ళ తండ్రి; జీతం డబ్బులు తీసుకెళుదువురమ్మని, తన కింద పనిచేసే టీచర్‌తో నల్లగొండకు కబురుపెట్టాడు. ఆ కబురు అందిందో లేదో- సురేష్ వాళ్ళ అమ్మ, "ఇంకెప్పుడెళతావురా?" అంటూ నసపెట్టి సురేష్ ప్రాణాలు తోడేసింది. డిగ్రీ పూర్తిచేసి ఖాళీగా ఉన్న సురేష్, తన రాచకార్యాలన్నీ పూర్తయ్యాక, సాయంత్రం అయిదు గంటలకు నల్లగొండ నుంచి బైక్ మీద దుప్పల్లికి బయలుదేరాడు. సాయంత్రం ఆరున్నర గంటలకు వలిగొండ చేరుకున్నాడు. వలిగొండలో చిన్నప్పటి ఫ్రెండ్ కలిస్తే, వాడితో ముచ్చట్లు, భోజనాలు పూర్తయ్యాక; వాడెంత వద్దన్నా వినక ఆ రాత్రే బయలుదేరాడు సురేష్. అప్పటికే రాత్రి బాగా పొద్దుపోయింది. నర్సాపూర్ వస్తుంటే, అప్పుడే మొదలయ్యింది వర్షం. వాన తగ్గేదాక ఒక బస్‌స్టాప్ షెల్టర్‌లో నిల్చొని, బైక్ స్టార్ట్ చేస్తే, అది ట్రబులిచ్చింది. పెట్రోల్ ఓవర్‌ఫ్లో కావడంతో కిక్ కొట్టి, కొట్టి సురేష్ అలసిపోయాడు. చివరకు ఎలాగో అలా బైక్ స్టార్ట్ చేసి నర్సాపూర్ చేరుకునేసరికి, రాత్రి పన్నెండు గంటలు కావొస్తుంది. అక్కడ్నించి మట్టిరోడ్ మీద పావుగంటలో దుప్పల్లి వెళ్ళిపోవచ్చు. చికాకుపరిచే ఆ వాతావరణంలో దుప్పల్లి రోడ్ వైపు బైక్ తిప్పాడు సురేష్.



వర్షం పూర్తిగా తగ్గింది. చిత్తడి నేలతో బైక్ కష్టంగా కదుల్తోంది. చుట్టూ చిమ్మచీకటి, ఎటు చూసినా అంధకారమే!నర్సాపూర్ ఊరు దాటాడు.భయంకరమైన కీచురాళ్ళశబ్దం, తన బైక్ శబ్దం తప్ప అతనికి ఏమీ విన్పించట్లేదు. మోటర్ బైక్ హెడ్‌లైట్ వెలుగులో కాస్తా దూరం వరకు మట్టిరోడ్డు మాత్రం కన్పిస్తోంది. చుట్టూ ఎత్తైన చెట్లు నెత్తి విరబోసుకున్న దెయ్యాల్లా భయానకంగా ఊగుతున్నాయి.

దూరంగా ఏదో ఆకారం, అస్పష్టంగా కదలాడుతున్నట్లుగా అన్పించింది. నిజమే, ఎవరో స్త్రీ బైక్‌కి అడ్డంగా నిల్చొని ఆపమన్నట్లు చేయి ఊపింది. సురేష్ బైక్ ఆపేసాడు. ఆ రాత్రి, చీకట్లో ఒంటరిగా ఒక స్త్రీ కన్పించడం ఆశ్చర్యంగా అన్పించింది. "ఎవరా?" అన్నట్లు ఆమెను చూసాడు. ఆమె తెల్లని చీర, జాకెట్ ధరించి వుంది. జడ వేసుకోకుండా విరబోసుకొని వుంది. మనిషి చామనఛాయలో ఉన్నా, చాలా అందంగా వుంది. నుదుటిన పెద్దబొట్టు, చేతిలో ఓ సంచీ ఉంది. గుడిలో ముత్యాలమ్మ నడిచొచ్చినట్లుగా వుంది. సురేష్ ఆమెనే ఆశ్చర్యంగా చూస్తుండిపోయాడు. ఆమె మాట్లాడటం మొదలెట్టింది. "సారు! జర నన్ను దుప్పల్లిల దింపు! నీకు పుణ్యముంటది; నర్సాపూర్‌ల ఆఖరి బస్ దిగిన, నా మొగుడు బస్టాండ్‌కి వస్తనన్నడు రాలె! ఒంటరి ఆడదాన్ని ఎట్ల పోవాలె?" అంటూ దీనంగా వేడుకుంది. ఇరవై ఏళ్ళు ఉంటాయేమో, ఆ అమ్మాయికి. చూడటానికి పల్లెటూరి అమాయకత్వంతో చాలా బావుంది. గుండెల్ని కోస్తున్న చలిగాలిలో-ఆ రాత్రి, ఆ అమ్మాయి ఇంకా అందంగా అన్పించింది. వానలో తడిసిన జాకెట్ లోంచి, పల్చని పైట చాటుగా ఎత్తైన ఆమె గుండెలు సురేష్ మతి చలించేట్లుగా ఎగిసెగిసి పడుతున్నాయి. వానలో తడిసిన ఆమె శరీరం సురేష్‌ని వివశుణ్ణి చేసింది. ఒక్కసారిగా ఒళ్ళంతా విద్యుత్ పాకినట్లుగా వింతగా ఫీలయ్యాడతడు. ఇంకేం ఆలోచించకుండా "సరే"

ఎక్కు" అన్నాడు. ఆమె బండి వెనుక ఎక్కి కూర్చుంది. అతని భుజం మీద చేయివేసి కాస్త ముందుకు వంగింది. ఆమె గుండెలు చురుక్కున వీపుకు తగిలాయి. స్త్రీ స్పర్శే ఎరుగని అతను ఆ తాకిడికి మైమరచిపోయాడు. హుషారుగా బైక్ వేగం పెంచాడు.

"నీ పేరేం పేరు?" సురేష్ అడిగాడు.

"పార్వతి" సమాధానం చెప్పిందామె.

"మీదే ఊరు?"

"మా తల్లిగారు చిత్తాపూర్, నన్ను దుప్పెల్లికిచ్చింద్రు!"

"నీ పేరు?" ప్రశ్నించిందామె.

"సురేష్"

"నీకు పెళ్ళయ్యిందా?"

"లేదు, ఇంకా చదువుకుంటున్న!" సురేష్ సమాధానం.

"గింత రాత్రప్పుడెక్కడికెళుతున్నావ్?"

"మా నాయిన, దుప్పల్లిల హెడ్మాస్టర్‌గా పని చేస్తుండు, ఆడికి బోతున్న!"

అలా మాటల్లో పడి, వాళ్ళు దట్టమైన అడవి మధ్యలోకి వచ్చేసారు. వెనుకవైపు నుంచి తనను రాసుకుపోతున్న ఆమె శరీరం, చనువుగా భుజం మీద వేసిన చేయి, తన చెవి దగ్గర ఆమె చెబుతున్నట్లు ముచ్చట్లు; ఇవన్నీ సురేష్‌లో తీయని ఊహలు రేపాయి. అందమైన ఆమె శరీరం, ఆ స్పర్శ అతనిని ఊరిస్తున్నాయి. అతని మనసులోని వాంఛలు చెలరేగాయి..

ఈ రాత్రి ఎలాగైనా సరే ఈమెతో "ఆ అనుభవం" రుచి చూడాలకున్నాడు.

ఆమెను మళ్ళీ మాటల్లోకి దింపాడు.

"గింత రాత్రి ఒక్కదానివే నడుసుకుంట వెళుతున్నవ్! భయం వేయలేదా?"

"తోడుగా నీవు దొరికినవ్‌గా సార్!"

ఆ మాట తనని కవ్విస్తున్నట్టుగా తోచిందతనికి.

మనసు తొందరపెట్టింది.

"నువ్వు చాలా బావున్నవ్"

"అబ్బా!అంత బాగున్నానా?" అంటూ, ఆ చీకటిలో గలగలా బిగ్గరగా నవ్వింది.

అతను హుషారుగా ఇంకాస్త వెనక్కి జరిగి, ఆమె శరీరం తగిలేలా కూర్చున్నాడు.

ఆమె ఇంకాస్త ముందుకు జరిగినట్టుగా అనిపించింది. తన మీద వాలిపోయి కూర్చున్నట్టుగా తోచింది.

ఆ స్పర్శకి సురేష్ మత్తెక్కిపోయాడు.

"త్వరగా పోనీయ్" అంటూ... ఆమె అతని భుజాన్ని గిల్లింది.

"హొప్పుకునేలా వుంది, ఈమెనెలాగయినా లోబర్చుకోవాలి" అనుకుంటూ బైక్ వేగం పెంచాడు.

అప్పుడే అతనికి బైక్ శబ్దంతో పాటు, ఎక్కడి నుంచో సన్నగా ఘల్లు..., ఘల్లు... మని గజ్జెల శబ్దం విన్పించింది.

ఘల్లు... ఘల్లుమని తనతోపాటు ఎవరో పరుగెత్తివస్తున్నట్లుగా గజ్జెల శబ్దం మళ్ళీ విన్పించింది.

భయంగా ఆమెతో "ఏదో గజ్జెలశబ్దం విన్పిస్తుంది గదా?" అన్నాడు.

"గజ్జెల శబ్దం లేదు, ఏం లేదు, త్వరగా పోనీయ్" అంటూ తొందర పెట్టింది.

భయంతో బైక్ స్పీడ్ పెంచాడు.

ఆమె మాట్లాడటం మానేసింది.


భుజం మీద ఆమె వేసిన చేయి, క్రమక్రమంగా చాలా బరువుగా అన్పించసాగింది సురేష్‌కి.

గజ్జెల శబ్దం మరింత పెద్దగా, వేగంగా తనను తరుముతున్నట్టుగా విన్పించసాగింది.

ఆ విషయం ఆమెతో చెబుదామని గొంతు విప్పబోతే, భయంతో నోరు పెగలట్లేదు.

చుట్టూ దట్టమైన చీకటి.

మోటర్‌బైక్ వెలుగులో కన్పిస్తున్న సన్నని మట్టిరోడ్డు, వానకు తడిసి చిత్తడి, చిత్తడిగా వుంది.



బైక్ లైట్ వెలుగును చూసి, అనుకోకుండా అడ్డుగా వచ్చిన అడవి ఎలుకలు, పందికొక్కులు, చాలా భయంగా, వింతగా, బెదురుగా అటు, యిటు పరిగెత్తుతున్నాయి.

మనసు ఏదో కీడును శంకించింది.

ఏమన్నా మాట్లాడదమన్నా సురేష్ గొంతు తడారిపోయింది.

దూరంగా ఎక్కడో కొంపలు మునిగిపోయినట్లుగా మొత్తుకుంటున్న నక్కల ఊళలు.

"అసలు తన బైక్ వెనుక కూర్చొన్న ఈ స్త్రీ ఎవరు?" ఈ ఆలోచన రాగానే అతను బైక్‌పై కొయ్యబారిపోయాడు.

అతనినెవరో దెయ్యం తరుముతున్నట్లుగా అన్పించి, వెన్నులో చలివణుకు పుట్టింది. మెదడు మొద్దుబారిపోయినట్టుగా అన్పించింది.

బైక్ వెనుకవైపు బరువు మరింత పెరగసాగింది.

బైక్‌ను ఎంత రేజ్ చేసినా, ఘాట్‌రోడ్ మీద వెళుతున్నట్టుగా స్లోగా వెళ్ళసాగింది. ఏం చేయాలో పాలుపోవట్లేదు. ఒక వక్క మరింత భీకరంగా విన్పిస్తున్న నక్కల ఊళలు, తనను తరుముతున్నట్టుగా వెంటాడుతున్న భయానక గజ్జెల శబ్దం.

**ఎవరో స్త్రీ బైక్‌కి అడ్డంగా నిల్చొని ఆపమన్నట్లు చేయి ఊపింది. సురేష్ బైక్ ఆపేసాడు. ఆ రాత్రి, చీకట్లో ఒంటరిగా ఒక స్త్రీ కన్పించడం అతనికి ఆశ్చర్యంగా అన్పించింది. "ఎవరా?" అన్నట్లు ఆమెను చూసాడు. ఆమె తెల్లని చీర, జాకెట్ వేసుకొని వుంది. జడ వేసుకోకుండా విరబోసుకొని వుంది. మనిషి చామనఛాయలో ఉన్నా, అందంగా వుంది.**

"రోదిస్తూ నడుస్తుందా...?" అన్నట్లు వినిపిస్తున్న బైక్ శబ్దం మిళితమై... ఒక ఉన్మాద వాతావరణం లోకి అతన్ని లాక్కెళ్ళాయి.

ఇంతలో బైక్‌కి ఎదురుగా వచ్చిన ఓ గబ్బిలాల గుంపు వెనుక కూర్చున్న ఆకారాన్ని చూసి..., అడవి అదిరిపోయేట్లుగా భీకరంగా అరుస్తూ, చెల్లాచెదరయిపోవడం చూసాడు. అయినా ఎవరో ఆజ్ఞాపిస్తున్నట్లుగా బైక్ నడుపుతూనే ఉన్నాడు. వెనుకవైపు, ఏదో ఏనుగు కూర్చొని లాగుతున్నట్లు నిమిష,నిమిషానికి బరువు పెరుగుతూనే వుంది. అంత చల్లటి వాతావరణంలోనూ సురేష్ శరీరం చెమటతో తడిసిపోయింది. మట్టిరోడ్డు మీద నుంచి దారితప్పి, ఏదో కాలిబాటలోకి బండి నడుస్తున్నట్లుగా అనిపించింది.

అది నిజమే సురేష్ కాటు కలిసాడు.

"పావుగంటలో రావల్సిన దుప్పల్లి, ఇంతసేపైన రాదేంటి?" అనుకున్నాడతను.

అతనిని ఆవరించిన మైకంలో అతనెటు వెళుతున్నాడో అతనికే తెలియదు. భయంతో వెనక్కిచూడలేక, భయానకమైన ఆ గజ్జెలశబ్దం వింటూ, బైక్ నడుపుతున్న అతనికి ఎవరిదో మనిషి గొంతు హఠాత్తుగా విన్పించింది.

"ఓ... ఎవరయ్యా? ఎవరు? ఓ... నిన్నేనయ్యా? అటెటు పోతున్నవయ్యా?హె...అటు బాటలేదు...,బొందలపడ్తవయ్యా? బండాపు...!" అంటూ ఓ ముసలాయన బండికి అడ్డం వచ్చాడు.

అలాగే స్లోగా బండి నడుపుతున్న సురేష్ ముందుకొచ్చి, "ఏయ్..." అంటూ మైకం వదిలేలా సురేష్ చెంప ఛెళ్ళుమనిపించాడు.

ఆ దెబ్బకు మత్తు వదిలింది.



"ఏవయ్య సారు? ఎటు బోతున్నవ్? అటెయిపు బొంద దప్ప, బాటలేదు!"

"ఇగో, ఈమె దీస్కబోతుంది, పోతున్న!" అన్నాడు సురేష్.

"ఓ... ఎవరమ్మ నీవు? ఎవరు....?" అనుకుంట గా ముసలాయన తన చేతిలున్న చిన్న కందిలి, ఆమె ముఖం మీదికి జరపబోయిండు!

అంతే..., ఆమె గబుక్కున బండి దూకి, ముసలాయన్ని, వెనక్కి నెట్టి, వడి వడిగా నడుచుకుంట..., ఆ చీకటిలో ముందు కెళ్ళి పోయింది.

కిందపడ్డ ముసలాయన తమాయించుకొని, లేచి; "ఓ ఎవరమ్మ నువ్వు...? మాట్లాడవేంది?" అనుకుంట ఆమె వెంట బడ్డడు.

ముసలాయన వెంటబడగానే ఆమె పరిగెత్తడం మొదలెట్టింది. తెల్ల చీరలో, గజ్జెల శబ్దంతో ముందు ఆమె వేగంగా పరిగెత్తుతోంది. "ఎవరమ్మా నీవు? ఆగు...! ఆగు...!" అని అరుస్తూ, ముసలాయన ఆమె వెంట పరిగెత్తుతుండు. బైక్ స్టాండ్ వేసి, బైక్ లైట్ వెలుగు కన్పిస్తుంటే, ఆ వెలుగులో సురేష్ ముసలాయన వెంట పరిగెత్త సాగిండు.

ఆ చీకటిలో ఆమె..., ఎదురుగా ఉన్న పాడుబడ్డ బావిలోకి గుభిల్లున దూకేసింది.

"అమ్మో...!" అంటూ ఆ ముసలాయన చటుక్కున వెనక్కి తిరిగి, "బతికిపోయినవ్... బిడ్డా...!" అంటూ, సురేష్‌ని ముందుకు వెళ్ళకుండా గట్టిగా పట్టుకున్నడు.

సురేష్ తీవ్రమైన ఉత్కంఠతో ఆ బావివైపు చూసాడు. అది చాలా పురాతనమైన బావి. బాగా పాడుబడిపోయి, పడాకు పడ్డట్టుగా ఉంది. ఆ చీకటిలో....., ఎవరో నీళ్ళలో దూకినట్లు నీటి తరంగాలు కదలాడుతుండటం సురేష్‌కి స్పష్టంగా కన్పించింది.

సురేష్‌కి గుండె ఆగిపోయినంత పనయ్యింది. భయంతో అతను కొయ్యబారిపోయాడు. ఒళ్ళంత విద్యుత్ షాక్ తగిలినట్లు, భయంతో వెన్నులో జలదరింపు కలిగింది.

ఏం భయం లేదన్నట్లు, ఆ ముసలాయన సురేష్ భుజం మీద చేయివేసి, నెమ్మదిగా బైక్ దాకా నడిపించుకవచ్చిండు.

"యియ్యాల నువ్వు, బతికిపోయినవ్ బిడ్డా! బుట్టాల లచ్చమ్మనే ఇరవై ఏండ్ల పోరి, నెలరోజుల కిందట గీ బాయిల దూకి సచ్చిపోయింది కొడుకా! ఎవరో పోరడు గీ పొల్లను పెండ్లి జేస్కుంటనని జెప్పి, కడుపు జేసి పారిపోయిండు! గా గోస భరించలేక గీ పోరి బాయిల దూకి సచ్చిపోయింది. సచ్చిబోయినంక దెయ్యమయి దిరుగుతోంది! గీ నెల్రోజులల్లనే నీలాంటి వయసు పోరగాండ్లనిద్దరిని, గీ బాయిదాంక దీసుకొచ్చి సంపిందని వాళ్ళువీళ్ళు అనుకోగా విన్నా. గియ్యాల నీ అదృష్టం బాగుండి, నా కంట్లబడి బతికినవు బిడ్డా" అని ఆ ముసలాయన ముచ్చటంత చెప్పు కొచ్చిండు.

ఆ ముచ్చటంత వినేసరికి, ఏం మాట్లాడాలో తెలియక సురేష్ భయంతో బిర్రబిగుసుకపోయిండు.

"అయ్యిందేదో అయ్యింది, గియ్యాల రాత్రి మా గూడెంల్నె పండువుగని రా బిడ్డా!" అంటూ ముసలాయన పిల్చిండు.

"సరే!" అన్నట్లు తలూపి, సురేష్ బైక్ ఎక్కిండు. వెనుక సీట్లో ముసలాయన కూర్చుండు. మళ్ళీ భయం వేసింది. అనుమానంతో, "గీ ముసలాయన కూడా నిజంగా మనిషేనా? లేక దెయ్యమా?" అనుకుంటూ ముసలాయన దారి చూయిస్తుంటే గూడెంలోకి బైక్ దీసుకపోయిండు. ముసలాయన గుడిసెలో ఇద్దరు పెద్ద మనుషులు కూర్చొని ముచ్చట్లు పెడ్తన్నరు. సురేష్ వైపు ఎవరన్నట్లుగా చూసింద్రు. విషయమంతా ముసలాయన వాళ్ళతో చెప్పిండు. ఆ రాత్రి మొత్తం దెయ్యాల కథలతోనే తెల్లారినట్లు, చాలా ముచ్చట్లు చెప్పింద్రు ఆ గూడెం మనుషులు. తెల్లారగట్ల మగత నిద్రలోంచి మేల్కొని సురేష్, ఆ ముసలాయనకు కాపాడినందుకు చాలా కృతజ్ఞతలు చెప్పి, దుప్పెల్లి వైపుగా బైక్ నడపసాగాడు.

దుప్పల్లి చేరుకోగానే జరిగిన విషయమంతా తండ్రికి పూసగుచ్చినట్లు చెప్పిండు సురేష్. అంతా విని, "ఆ... గియ్యాల రేపు దెయ్యాలున్నాయిరా! అంతా నీ భ్రమగాని" అంటూ తేలిగ్గా కొట్టిపారేసిండాయన.

కానీ, అతని మనసులో మాత్రం, ఆ రాత్రి సంఘటన భయం భయంగా గుర్తుకొస్తూనేవుంది. దగ్గరి మిత్రులకు వివరంగా చెప్పాడు. విన్న వాళ్ళంతా, "ఇది జరిగిందో, లేదో నమ్మబుద్ధి కావట్లేదు గాని, నీ ఇమాజినేషన్ బావుందోయ్" అంటూ తేలిగ్గా తీసేశారు. దాంతో నిజంగా జరిగింద భ్రమెూ, వాన్తవమెూ తేల్చుకోలేని స్థితికి లోనయ్యాడు. అంతేగాక ఒక మిత్రుడు చెప్పినట్టు "ఆడవాళ్ళలోనే, దెయ్యాలు ఎక్కువగా ఎందుకవుతారా?" అనే ప్రశ్న అతన్ని వెంటాడింది. అయినా ఆ సంఘటన తాలూకు ఆలోచనల సుడిగుండాలలో చిక్కుకుపోయాడు.

** ** **

రోజులు గడుస్తున్నా పదేపదే నిద్రలో కలవరిస్తూ విపరీతంగా భయపడుతున్న సురేష్‌ని, వాళ్ళ తండ్రి గమనిస్తూనే ఉన్నాడు. ఇక లాభంలేదని ఒక రోజు సురేష్‌ని బలవంతంగా హైదరాబాద్‌లోని సైకాయట్రిస్ట్ దగ్గరికి తీసుకుపోయాడు.

సురేష్ అనుభవాలను, అతను చెబుతున్నదాన్ని ఓపిగ్గా విన్న డాక్టర్. "ఫరవాలేదు మీ ఫీలింగ్స్ వాస్తవాలకు దగ్గరగా ఉన్నా, జరగని వాటిని, జరిగినట్లు భ్రమపడి, ఆ భ్రమనే వాస్తవంగా నమ్మే ఓ మానసిక వ్యాధి మీలో ఉంది; మీరు సహకరిస్తే మీ మానసిక వ్యాధికి ట్రీట్‌మెంట్ స్టార్ట్ చేస్తానని" అన్నాడు సురేష్‌తో.

ఆశ్చర్యపోతూనే అతను అందుకు ఒప్పుకున్నాడు. ట్రీట్‌మెంట్ మొదలైన తరువాత, వాస్తవానికి, భ్రమకు మధ్యగల తేడాల్ని అంచనా వేయడంలో సఫలమయ్యాడు. ఆ రాత్రి, బైక్ మీద తనో స్త్రీకి లిఫ్ట్ యిచ్చిన మాట వాస్తవమే కాని, ఆమెనో దెయ్యంలా తానూహించినదంతా, తన మానసిక భ్రమేనని గుర్తించాడు. భ్రమకీ, వాస్తవానికీ మధ్యన ఉన్న సన్నటిరేఖననుకున్నాడు.

అతడు ఫ్రెండ్స్‌కి దెయ్యాల కథలు చెప్పడం మానేసాడు.

సురేష్ తండ్రి రిలీఫ్‌గా గుండెల్నిండా ఊపిరి పీల్చుకున్నాడు. ●

ముసలాయన వెంట బడగానే ఆమె పరిగెత్తడం మొదలెట్టింది. తెల్లచీరలో, గజ్జెల శబ్దంతో ముందు ఆమె వేగంగా పరిగెత్తుతోంది. "ఎవరమ్మా నీవు? ఆగు...! ఆగు...!" అని అరుస్తూ, ముసలాయన ఆమె వెంట పరిగెత్తుతుండు. బైక్ స్టాండ్ వేసి, బైక్ లైట్ వెలుగు కన్పిస్తుంటే, ఆ వెలుగులో సురేష్ ముసలాయన వెంట పరిగెత్త సాగిండు. ఆ చీకటిలో ఆమె..., ఎదురుగా ఉన్న పాడుబడ్డ బావిలోకి గుభిల్లున దూకేసింది.